క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసయాదవ్

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామానికి చెందిన విద్యార్థిని దివ్యశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన అండర్–14 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో దివ్యశ్రీ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం శ్రీనివాసయాదవ్ తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు అభినందించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులను పొందాలని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం సి.బెళగల్ పరిధిలోని రైతు సేవా కేంద్రం – 2, మధ్యాహ్నం కంబదహాల్ గ్రామ సచివాలయంలో ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఆధునిక వ్యవసాయం, యాంత్రీకరణ పద్ధతులను ఆయన రైతులకు వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. చీడపీడలు ఆశించకుండా తీసుకోవాల్సి చర్యలను ఏఓ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈపీఈఓ సువేద, వీహెచ్‌ఏ శశిదేవి, రైతులు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది.


అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్ : స్థానిక కోటవీధి, కాంతినగర్, బీసీ కాలనీల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు మంగళవారం జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మాదులు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అనురాధ, వార్డుమెంబర్లు లింగన్న, రవి, విష్ణుదాస్, రాజు, కౌలుట్లయ్య, ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు, నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, రవికుమార్‌రెడ్డి, బైస్‌దొడ్డి హనుమంతు, లింగమూర్తి, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణపై అభ్యంతరాలు తెలుపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ఓటర్ల జాబితాపై ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలుపాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాణ్యంలోని రెవెన్యూ కారాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటరు హక్కును పరిశీలించుకోవాలని, తప్పొప్పులను సవరించుకోవచ్చన్నారు. ఈనెల 29నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రంగారమేష్, శింకరయ్య, లాయర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా... ‘కియోస్క్‌లు’

- రైతుసేవా కేంద్రాల్లో యంత్రాలను మూలనపడేసిన వైనం
- మారని టీడీపీ ప్రభుత్వ తీరు... ప్రజాధనం వృథా
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



రైతు సేవా కేంద్రంలో అలంకార ప్రాయంగా ఉన్న కియోస్క్ డిజిటల్ యంత్రం

సి.బెళగల్: వ్యవసాయ రంగాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి సర్కార్ గద్దెనెక్కి ఐదు నెలలవుతున్నా రైతులకు ఇచ్చిన హామీని కనీసం ఒక్కటి కూడా అమలు చేయని తీరు ఇందుకు సాక్ష్యం. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ పనులు జోరుగా సాగుతున్నా పెట్టుబడి సాయంపై కనీసం స్పష్టత లేదని రైతులు ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామన్న హామీని సీఎం చంద్రబాబు విస్మరించారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చడం లేదా.. తొలగించడం మినహా చేసిందేమీ లేదని వాపోతున్నారు రైతులు. ఈ నేపథ్యంలో రైతులకు ఎంతో ఉపయోగపడే కియోస్క్ యంత్రాలను మూలన పడేశారని విమర్శలు రైతాంగం నుంచి వెల్లువెత్తుతున్నాయి.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చిన గత ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. రైతుల సౌకర్యార్థం సచివాలయాలకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలను నిర్మించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో ఆర్బీకే భవనాన్ని రూ. 21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలు అందజేసేందుకు రూ. లక్షతో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. సి.బెళగల్ మండలంలో 16 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ప్రతి ఆర్బీకేలో ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే కియోస్క్ యంత్రం ఉంది. ఆర్బీకేల ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాల పరికరాలు, పశువులకు దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల బహుళ సేవలను కియోస్క్ డిజిటల్‌తో కల్పించారు. వ్యవసాయ ఉత్పాదకాలను ఆన్‌లైన్‌లో రైతులు బుక్ చేసుకునే సౌకర్యం ఉంది. ఆయా ప్రాంతాలలోని వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెంటింగ్ ధరలు అందుబాటులో ఉంటాయి. పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో ఉంటుంది. కియోస్క్ యంత్రంతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలును ముందుగానే నమోదు చేసుకుని అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు రైతులు కియోస్క్ సేవలను పొందారు కూడా. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను మూలనపడేసింది. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసినందునే ఈ యంత్రాలను కూటమి సర్కార్ మూలన పడేసిందని రైతులు నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాకు ఎంతగానో ఉపయోగ పడేవి



గత ప్రభుత్వంలో ఆర్బీకేలలో రైతులకు అవసరమైన అన్ని సేవలు అందేవి. ఇప్పుడు అలాంటి సేవలు, సౌకర్యాలు ఆర్బీకేలలో (రైతు సేవా కేంద్రాలలో) అందడంలేదు. కియోస్క్‌లను ఉపయోగించుకుని ఎరువులు, మందులు పంట సాగుకు ముందుగానే పొందేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం లేదు. ప్రభుత్వం యంత్రాలను మూలన పడేయడం ఏ మాత్రం సమంజసం కాదు. మళ్లీ ఉపయోగంలోకి తెస్తే బాగుంటుంది.

– ఉమామహేశ్వరరెడ్డి, రైతు, సి.బెళగల్

రైతులకు సేవలందించడం ప్రభుత్వ బాధ్యత



రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సేవలు ఆర్బీకేలోని కియోస్క్‌ల ద్వారా అందేవి. పల్లెల్లోని రైతాంగంకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు, పెద్ద పట్టణాలకు వెళ్లకుండ గ్రామాల్లోనే అందుబాటులో ఉండేవి. వ్యవసాయం సంబంధించిన సేవలను అందించాల్సి బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కియోస్క్ యంత్రాలను రైతులకు అందుబాటులోకి తేవాలి.

– ఇమ్మానియేలు, ఇనగండ్ల సర్పంచ్

కియోస్క్ సేవలను కొనసాగించాలి



కియోస్క్ సేవలను కొనసాగించాలి. ఎరువుల నిల్వలు, ధరలు రైతులు ఎప్పటికి అప్పుడు తెలుసుకునేవారు. వ్యవసాయ పథకాలు సకాలంలో అందించేందుకు కియోస్క్ చక్కగా పనిచేశాయి. మండల కేంద్రాలకు వెళ్లకుండా ప్రతి సేవ గ్రామాల్లోనే అందేవి. రైతులు కూడా ఆ యంత్రాలను వినియోగించే తీరును తెలుసుకున్నారు. పేద రైతులకు ఎంతగానో ఉపయోగపడే కియోస్క్ సేవలను కొనసాగించాలి.

– మోహన్, సీపీఎం నాయకుడు

ఇప్పుడు యాప్‌లను వాడుతున్నాం



కియోస్క్‌లను ప్రస్తుతం వినియోగచండం లేదన్నది వాస్తవమే. అయితే ప్రభుత్వం రైతులకు అందించే సేవలు మాత్రం ఎప్పటికప్పుడు అందేలా ప్రత్యామ్నాయ మార్గాలలో చేపట్టడం జరిగింది. ఇప్పటికే సీఎంఐడీ అనే యాప్ ద్వారా రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను అందిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు యాప్ ద్వారా రైతాంగానికి అన్ని సేవలు అందజేస్తున్నాం.

– మల్లేష్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

పెట్రోల్‌లో తేడా..



బైక్‌లో నింపిన పెట్రోల్ రంగుమారిన దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజు పల్లెలో జీకేఎం పంప్‌లో బంక్‌లో మంగళవారం పెట్రోల్ రంగుమారి తేడా వచ్చింది. ఈ బంక్‌లో పెట్రోల్ పట్టుకున్న వాహనాలు కొంత దూరం వెళ్లాక నిలిచిపోయాయి. ఉదయం నుంచి పెట్రోల్ విక్రయాలు ప్రారంభించారు. అయితే పెట్రోల్ పట్టుకున్న చాలా వరకు వాహనాలను నిలిచిపోతున్నాయి. ఎంత ప్రయత్నించినా వాహనాలు స్టార్ట్ కాలేదు. దీంతో వాహనచోదకులకు అనుమానం వచ్చింది. బైక్‌లోని పెట్రోల్‌ను బాటిళ్లలో పట్టి చూడగా రంగులో తేడా కనిపించింది. దీంతో వాహనచోదకులు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు. పెట్రోల్‌ను తీసి పరీక్షించగా నీరు కలిసినట్లు ఉండడంతో బంక్ నిర్వాహకులను నిలదీశారు. ఈ విషయంపై బంక్ యజమాని వివరణ కోరగా పెట్రోల్‌లో ఇథనాల్ ఎక్కువగా కలిపారన్నారు. 20–30లీటర్ల పట్టగానే వాహనదారులు తమ దృష్టికి తీసుకురాగా పెట్రోల్‌ను పరీక్షించామన్నారు. విషయాన్ని కంపెనీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అధికారులు ఏకపక్ష ధోరణి వీడాలి

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



జంబులాపరమేశ్వరిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: అధికారుల ఏకపక్ష ధోరణి వీడాలని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌ఎడ్డి పేర్కొన్నారు. మంగళవారం వడ్డుగండ్ల గ్రామ నాయకుడు ఎల్లకృష్ణ నిర్వహించిన శుభ కార్యక్రమానికి కాటసాని హాజరయ్యారు. సుగాలిమెట్ట వద్ద ఉన్న జంబులా పరమేశ్వరిని దర్శించుకున్నారు. అనంతరం కాటసాని విలేకరులతో మాట్లాడారు. అధికారులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల వినతులను నిర్లక్ష్యం చేస్తున్నారని, అధికార పార్టీల నాయకులకు చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆ పద్ధతులకు స్వస్తి చెప్పాలని సూచించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఏదైనా సమస్యలపై అర్జీలు సమర్పించినప్పుడు నిష్పక్ష పాతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందని కాటసాని తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. చిరు ఉద్యోగులపై అధికారులు ఒత్తిళ్లు అధికమయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో అప్పులు తెస్తే శ్రీలంకతో పోల్చిన నాయకులు నేడు ప్రతి మంగళవారం అప్పుల దినంగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామలక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు, సుబ్బారాయుడు, పుల్లయ్య, కరుణాకర్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, వడ్డుగండ్ల రాముడు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై దృష్టి సారించాలి

పాణ్యం: విదేశీ విద్యపై విద్యార్థులు దృష్టి సారించాలని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం ఈఈఈ మైక్రోవేవ్ థియరీ అండ్ టెక్నాలజీ సొసైటీ విద్య ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈసీఈ, సీఎస్ఈ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కెరియర్‌పై అవగాహన కల్పించారు. ప్రముఖ యూనివర్శిటీలలో అందుబాటులో ఉన్న కోర్సులు, అడ్మిషన్ ప్రక్రియ, స్కాలర్‌షిప్, ఫెలోషిప్, వీసా ప్రక్రియ, ఉపాధి అవకాశాలను ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వివరించారు. ప్రతిభ ఆధారంగా విదేశాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య

కల్లూరు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలపై రైతులు వినతులు సమర్పిస్తే పరిశీలించిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభకు జేసీతోపాటు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూ విస్తీర్ణం సమస్య, ఉమ్మడి ఎల్‌పీ ఖాతా, గట్లలో తేడాలు తదితర సమస్యలు ఉంటే రైతులు అర్జీలు ఇవ్వాలన్నారు. రైతులు ఇచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కారించాలని ఈ సందర్భంగా జేసీ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ప్రతి భూ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ పద్మావతమ్మ, ఎంపీటీసీ మునిస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : రీ సర్వేలో నెలకొన్న భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి తెలిపారు. గూడూరు మండలంలోని మల్లాపురం గ్రామంలో తహసీల్దార్ రామాంజినేయులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. రైతులు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు భాగ్యలక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ బాలునాయక్, గ్రామ వీఆర్వోలు ఖాజా బందెనవాజ్, సర్వేయర్ అరుణ్, రైతులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రీ సర్వే సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. రైతుల అర్జీలను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు శేఖర్, శ్రీనివాసులు, సాయిరమణ, సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామంలో మంగళవారం రీ సర్వే డీటీ షర్మిలారెడ్డి గ్రామ సభ నిర్వహించారు. భూముల రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై రైతులను వినతులు స్వీకించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం, విఆర్‌ఓ మధు, సచివాలయ సర్వేయర్లు, స్థానిక నాయకులు సుధాకర్‌రావు, అరుణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, బొల్లారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరులో మంగళవారం రీ సర్వే సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి గ్రామ సభ నిర్వహించారు. రైతులన నుంచి వినతులు స్వీకరించిన డీటీ పరిశీలించిన పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా కొనిదేడులో గ్రామ సభ ఉంటుందని, రైతులు వినతులు అందజేసి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న రీసర్వే డీటీ షర్మిలారెడ్డి

రైతులకు న్యాయం చేస్తాం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్

కర్నూలు (రూరల్) : జాతీయ రహదారి(340సి) నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు అన్నివిధాలుగా న్యాయం చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్ హామీ ఇచ్చారు. పొలాలకు వెళ్లేందుకు అనుగుణంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వారం కిందట నూతనపల్లె గ్రామ రైతులు నిరసన చేపట్టిన నేథ్యంలో మంగళవారం కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్‌తో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి జాతీయ రహదారిని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతుల అవసరం మేరకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయిస్తామని ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. హైవే అధికారులతో చర్చించి సర్వీస్ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతులకు వీలైనంత త్వరగా అందజేస్తామన్నారు. అనంతరం గార్గేయపురంలో రోడ్డు విస్తరణకు అదనంగా కావాల్సిన భూమిని పరిశీలించారు.

నాటు సారా విక్రేత అరెస్ట్

గడివేముల: మండల పరిధిలోని బొల్లవరం గ్రామానికి చెందిన ఈరు నాయక్ నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈరు నాయక్ ఇంటి వద్ద నాటు సారా విక్రయిస్తున్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఐదు లీటర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు నంద్యాల కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వివరించారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



రక్తదానం చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: దేశరక్షణకు ప్రాణత్యాగాలు చేసిన అమరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీఐతో పాటు, ఉలిందకొండ, నాగలాపురం ఎస్‌ఐలు ధనంజయ, ఆశలత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజం రక్షణలో పోలీసు వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే దేశ రక్షణలో జవాన్‌లు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం యువకులు రక్తదానం చేశారు.

క్రీడల్లోనూ ప్రతిభ చాటుకోవాలి



ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన పంచలింగాల కస్తూర్బా విద్యార్థినులు

కర్నూలు (రూరల్): విద్యార్థినులు విద్యతోపాటు క్రీడాల్లోనూ ప్రతిభ చాటుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. పంచలింగాల కస్తూర్బా విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో వారితో కలిసి ప్రిన్సిపాల్ స్వప్న కుమారి మంగళవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆయన నివాసంలో కలిశారు. తమ విద్యార్థినులు గతనెలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థినులు మమత, దివ్యాంజలి, రేణుక, సాహితి, భవిత, హారికను ఎంపీ అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ గీతాంజలి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పంట బీమాకు ప్రీమియం చెల్లింపు తప్పనిసరి



ప్రీమియం చెల్లించిన రైతుకు రసీదు అందజేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రబీ సీజన్‌లో భాగంగా సాగుచేసుకున్న పంటలకు సంబంధించి బీమాకు ప్రీమియం సొమ్మును రైతులు తప్పనిసరిగా చెల్లించాలని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో పంటల బీమాపై సి.బెళగల్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం జీఓను విడుదల చేసిందన్నారు. వరి పంట ఎకరాకు రూ.630, శనగ – రూ.420, జొన్న– రూ.297, వేరుశనగ – రూ.450, ఉల్లి –రూ.1,350, టమాట ఎకరాకు రూ.1,50 చొప్పున రైతులు ప్రీమియం రైతాంగం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రబీ కాలపు పంట రుణాలు బ్యాంక్‌లలో తీసుకున్నవారు బ్యాంక్‌లలో, మిగిలిన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రీమియంను చెల్లించవచ్చన్నారు. వరి పంటకు ప్రీమియం చెల్లించేందుకు 2024 డిసెంబర్ 31వ తేది, మిగతా పంటలకు 2024 డిసెంబర్ 15వ తేదిలోగా రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని ఏఓ వివరించారు. ప్రీమియి చెల్లించిన రైతులకు ఏఓ రసీదు అందజేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఆసిఫ్‌బాషా, సునంద, శశిదేవిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణ

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీలో స్వాతి (9వ తరగతి), భువనేష్ (10వ తరగతి) జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్‌లో కాకినాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారని పీడీ గిడ్డయ్య తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కోడుమూరు హైస్కూల్ విద్యార్థులు

కోడుమూరు రూరల్ : రాష్ట్ర స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీలకు కోడుమూరు హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. కర్నూలులో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 9వతరగతి విద్యార్థులు రాజశేఖరరెడ్డి అండర్–14 విభాగం కబడ్డీలో, రాఘవ అండర్–17విభాగంలో క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈఓ తైమూర్‌బాషా తెలిపారు. విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్రనాయుడుని ఈ సందర్భంగా ఎంఈఓ తైమూర్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు